బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

**ఆంతర్యం**

బాబాని దర్శించి - బాబా వద్ద ఓ వారమయినా గడపాలన్న ఉద్దేశ్యంతో బాబా భక్తుడు రెహమాన్ అనే అతను వచ్చాడు బామా దగ్గరికి

కానీ బాబా అతనిని “వచ్చావుగా, చూసావుగా, ఇక వచ్చినదారినే వెళ్ళు” అన్నారు.

దానికి అతను నొచ్చుకుంటూ “అదేమిటి బాబా నేను మీ దగ్గర ఓ వారం ఉందామని వచ్చాను. నన్ను వెంటనే వెళ్ళిపొమ్మంటారేమిటి?” అంటూ ఇంకా ఏదో అడగబోతుండగా, “అది అంతే తక్షణం నువ్వెళ్ళిపో, మరోసారి వచ్చినప్పుడు ఉందువుగానిలే” అంటూ తరిమేసారు. అంతేకాకుండా, అతనికి ఊదా ప్రసాదంగా యిచ్చి “దీనిని నిర్లక్ష్యం చెయ్యకు. అవసరమైనప్పుడు నీళ్ళలో చిటికెడు కలుపుకుని త్రాగితే పోయే ప్రాణాలు సైతం నిలుస్తాయి. బొట్టు పెట్టుకుంటే భయం పోతుంది. గాయాలకు రాస్తే ఉపశమనం కలుగుతుంది. కాబట్టి ఈ ఊదాని నన్నుగానే భావించి జాగ్రత్తగా వాడుకో” అన్నారు.

ఇక బాబాని కాదని అక్కడ ఉండలేక రెహమాన్ బాధపడుతూనే వెనుతిరిగాడు. బస్సులో అతను తన ఊరు చేరాడు. బస్సు దిగంగానే అతనికి తన స్నేహితుడు కనిపించి “నేను నీ కోసమే బయలుదేరుతున్నాను. దేవుడి దయవలన నువ్వే వచ్చేశావు” అన్నాడు కళ్ళు తన కండువాతో వత్తుకుంటూ.

“ఏం, ఎందుకు నాకోసం రావటం, ఏం జరిగింది?” అన్నాడు రెహమాన్ ఆదుర్దాగా.

“ఏం లేదులే ఇంటికి పద” అంటూ తీసుకెళ్ళాడు టాంగాలో.

ఇంటికి వెళ్ళి అక్కడ జరిగింది చూసి రెహమాన్ ఆశ్చర్యంతో “ఏమిటిదంతా? ఎలా జరిగింది ఇంత ఘోరం?” అన్నాడు.

“ఏంలేదు. మొన్నటి రోజున నీవు షిరిడీకని వెళ్ళావా. నిన్న ఉదయం నీ భార్య వంటచేస్తూ పొరపాటున నిప్పుల్లో చీరపడగా, చీర కాలి, మనిషికీ బాగా గాయాలైనాయి. చీర విప్పేలోపే ఒళ్ళు కూడా బాగా కాలింది. ఆమెకి స్పృహ రాగానే నేను నీ దగ్గరికి బయలుదేరాను” అంటూ చెప్పాడు రెహమాన్ స్నేహితుడు.

రెహమాన్‌కి అప్పుడర్థమయింది, బాబా ఎందుకు అంత తొందరగా వెనక్కి పంపేసారో పైగా హెచ్చరిస్తూ ఊదానిచ్చిన సంగతి! “బాబా ఎక్కడ ఉన్నా, భక్తులను, వారి కుటుంబాలను ఎలా ఆదుకుంటారో, రక్షిస్తారో ఇప్పుడర్థమయింది. ఆయన సర్వాంతర్యామి, సర్వం తెలుసుకొని భక్తులను హెచ్చరిస్తూంటారు. బాబా, దాయమయా, కరుణామయా ఇన్ని హెచ్చరికలతో, మందుతో పంపివేసినా అసలు విషయం మాత్రం చెప్పలేకుండా, నేను కంగారుపడతానని, భయానికి బొట్టు, గాయాలను పైపూత, నొప్పులకు నోట్లోకి నీళ్ళు అన్నావ నేను నీ ఆంతర్యం అర్థంచేసుకోలేకపోయాను సుమా!” అంటూ విలపిస్తూ ఆ పైన బాబా చెప్పినట్లు చేసాడు. రెహమాన్. కాలక్రమేణా ఆమెకు నయం అయింది. తర్వాత షిరిడీకి వచ్చి బాబాని దర్శించి, సేవించి తరించారు ఆ దంపతులిద్దరూ.